క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



హారతి ఇస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయస్వామి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వాములకు అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్ శర్మ భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రుద్రవరం: ఎంబీబీఎస్ సీట్లు సాధించిన స్థానిక ఏపీ మోడల్ స్కూల్ పూర్వ విద్యార్థులను శనివారం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్ పూర్వ విద్యార్థులు బిందు, ఛాయాదేవి, లోకేష్, పూజిత, శరత్ నీట్‌లో మంచి ర్యాంకులు తెచ్చుకుని జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్లు సాధించడం మనకు గర్వకారణమన్నారు. మిగతా విద్యార్థులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని బాగా చదవాలని సూచించారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు

శిరివెళ్ల: ఉర్దూ మీడియంలో విద్యా ప్రమాణాలు పెంచాలని ఉర్దూ మీడియం పెడగాగి రాష్ట్ర పరిశీలకుడు షేక్ అబ్దుల్ గని అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, యర్రగుంట్ల ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా ఉర్దూ అసిస్టెంట్ అకాడమీ మానిటరింగ్ అధికారి యూసఫ్, అదనపు ఎంఈఓ నాగార్జునరెడ్డి, హెచ్‌ఎం విజయకుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో ముందుండాలి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని ఆర్‌జీఎం, శాంతిరాం గ్రూప్ ఆఫ్ సంస్థల చైర్మన్ శాంతిరాముడు అన్నారు. శనివారం శాంతిరాం ఇంటర్నేషనల్ పాఠశాలలో జరిగిన క్రీడా పోటీలు వాలీబాల్, త్రోబాల్, క్రికెట్, కబడ్డీ, దర్జీబాల్, టగ్ ఆఫ్ వార్, బ్యాడ్మింటన్, మార్చ్‌ఫాస్ట్ పోటీలను నిర్వహించారు. విజేతలైన వారికి బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ మధుసూదనశెట్టి, చౌహాన్, గాయత్రి, ప్రభాకర్‌రెడ్డి, జయచంద్రప్రసాద్, సుబ్రమణ్యం, పీఈటీ పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడదాం



మహిళా కండెక్టర్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న డీఎం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల ఆర్టీసీ డిపో ఉద్యోగులు ఆదాయాన్ని పెంచి డిపో అభివృద్ధికి తోడ్పడాలని డీఎం గంగాధర్‌రావు సూచించారు. శనివారం డిపో ఆవరణలో ఆగస్టు నెలలో ప్రతిభ చూపిన సిబ్బందికి అభినందన సభ కార్యక్రమం నిర్వహించారు. అత్యధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్లు, డ్రైవర్లు నాగన్న, వలి, ప్రసాద్, నడిపెన్న, మల్లికార్జున, బాషా, రాజు, లక్ష్మమ్మ, కృష్ణ, రామయ్యకు ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకాన్ని అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు, విజయ్‌కుమార్, యూనియన్ నాయకులు సుబ్బరాజు పాల్గొన్నారు.

నేడు ఏపీటీఎఫ్ జిల్లా మహాసభ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ పీజీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 22వ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు, అధ్యక్షులు సాంబశివుడు పిలుపునిచ్చారు. ఉదయం 9గంటలకు మాధవస్వామి అధ్యక్షతన సభ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా మంత్రులతో పాటు శాసనమండలి సభ్యులు రామగోపాల్‌రెడ్డి, డీఈఓ సుధాకర్ రెడ్డి, డిప్యూటీ డీఈఓ బేగ్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయరాజు ముఖ్యఅతిథులుగా పాల్గొంటున్నట్లు చెప్పారు.

క్రీడా పోటీలు షురూ

- ఈనెల 23 నుంచి జిల్లా స్థాయి స్కూల్ గేమ్ ఎంపిక పోటీలు
- అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీలు
- గ్రిగ్ పోటీల నిర్వహణకు సన్నాహాలు
- త్వరలోనే అసోసియేషన్ క్రీడలు

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల, కళాశాల స్థాయి క్రీడలకు రంగం సిద్ధమైంది. తొలుత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జీఎఫ్) పోటీలు మొదలయ్యాయి. తరువాత ఆయా క్రీడలకు చెందిన అసోసియేషన్ల ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకూ కసరత్తు జరుగుతోంది. పదేళ్లుగా నిలిచి పోయిన జోనల్ గ్రిగ్ పోటీలను సైతం నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు మొదలయ్యాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 3వేల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొననున్నారు. వీరితో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు చెందిన క్రీడాకారులు సైతం పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించనున్నారు. తొలుత మండల స్థాయి, తరువాత నియోజకవర్గ, ఉమ్మడి జిల్లా స్థాయిలో జరుగనున్నాయి. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారు. తరువాత వీరు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశముంది. అండర్-14, 17, 19 విభాగాల్లో బాలుర, బాలికలకు జరిగే పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 2వేల మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో పోటీలు ప్రారంభించారు.మండల స్థాయిలో ఏడు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా,



షాట్ పుట్ వేస్తున్న విద్యార్థిని (ఫైల్)

అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. మిగిలిన క్రీడాంశాలు నియోజకవర్గ స్థాయి, హేమర్ త్రో, పోల్‌వాల్ట్, స్విమ్మింగ్ మాత్రం ఉమ్మడి జిల్లా స్థాయిలో మాత్రమే నిర్వహించనున్నారు.

సర్టిఫికెట్ కోసం..

ఇంజినీరింగ్, మెడికల్ వంటి సీట్ల భర్తీకి స్పోర్ట్స్ కోటా కీలకం. ఐఐటీ, ఎన్ఐటీ వంటి సంస్థల్లో ప్రవేశాలకు సైతం ఉపయోగపడుతుంది. ఎంపిక చేసిన కొన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాలో భర్తీకి ఎస్‌జీఎఫ్ సర్టిఫికెట్ విలువైంది. దీంతో ఈ పోటీలను అటు పాఠశాల, ఇటు కళాశాల క్రీడాకారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. రాష్ట్ర స్థాయిలో అండర్-14, 17, 19 విభాగాల్లో ఫెన్సింగ్, టేబుల్ టెన్నిస్, ఖోఖో పోటీలు నంద్యాలలోనే నిర్వహించనున్నారు.

ఈ ఏడాది నుంచి గ్రిగ్ పోటీలు...

కొన్నేళ్లుగా నిలిచిపోయిన పాఠశాల స్థాయి గ్రిగ్ పోటీలను తిరిగి ఈ ఏడాది మొదలు పెట్టాలని ఆయా పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు. వెటరన్ క్రీడాకారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన తొలుత జోన్, తరువాత సెంట్రల్ జోన్ పోటీలు నిర్వహించే వారు. ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీతో కలుపుకొని మొత్తం ఎనిమిది జోన్లు ఉండేవి. ఇందులో విజేతలను సెంట్రల్ జోన్ (ఉమ్మడి జిల్లా అంతా కలిపి) పోటీలు నిర్వహించేవారు. ఇప్పుడు కూడా అదే పద్ధతినే పాటించాలని సంకల్పించారు. ఇందుకు ప్రభుత్వ సహకారం అవసరం ఉన్నందున త్వరలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులను కలిసేందుకు రెండు జిల్లాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయ సంఘాలు సిద్ధమవుతున్నాయి.

త్వరలోనే అసోసియేషన్ క్రీడలు...

ఉమ్మడి జిల్లాలోని పలు క్రీడాంశాలకు సంబంధించి నిర్వహించే అసోసియేషన్ల క్రీడలకు సైతం షెడ్యూల్ విడుదల కానుంది. మిగిలిన అసోసియేషన్లు కూడా ఆయా విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహణ



ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. మండల, నియోజకవర్గ స్థాయిలతో పాటు ఉమ్మడి జిల్లాలో పోటీలు జరుగుతాయి. ప్రతి మండల కేంద్రం, నియోజకవర్గంలో మైదానం ఉన్నచోట పోటీలు నిర్వహిస్తాం. ఈసారి ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు పెద్దఎత్తున జరుగుతుండటంతో ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు మేలు జరగనుంది.

– శివకుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ, నంద్యాల

అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై చెన్నైకి చెందిన మైత్రీ సెంటర్ ఫర్ ఆర్ట్స్ వారి సంప్రదాయ నృత్యం అలరించింది. కార్యక్రమంలో గణపతిం, గురు నవనీతం, భ్రమరాంబాష్టకం, తాండవనృత్యకరి, భో శంభో, చక్కని మా శివయ్య గీతాలకు అరుణ్‌కుమార్, గాయత్రి ఆనంద్, అభినయ, యువశ్రీ, తనూశ్రీ తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన ఆటో, రేషన్ బియ్యం బస్తాలు

మహానంది: బోయిలకుంట్ల మెట్ట వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. జోన్, గోస్పాడు గ్రామాలకు చెందిన యానాం నాగేష్, లక్ష్మీదేవి.. గాజులపల్లె, చుట్టుపక్కల గ్రామాల నుంచి రేషన్ బియ్యం సేకరించి ఆటోలో తరలిస్తున్నారన్న సమాచారంతో నిఘా ఉంచి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 12 బస్తాల్లో ఉన్న 600 కిలోల బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి దిగుబడులు

గోస్పాడు: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో రైతు మద్దిలేటి ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని నంద్యాల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు పొలాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి పంటలను సాగు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన దిగుబడులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో పాటు ధర కూడా బాగానే లభిస్తుందని చెప్పారు. వీటి ద్వారా ప్రజలకు మంచి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమి సారవంతం అవుతుందని, రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. అడిషనల్ డీపీఎం సలాం, ఏఓ స్వప్నికారెడ్డి, ఎన్ఎఫ్ఏ రాముడు, యూనిట్ ఇన్‌చార్జి అరుణ, మల్లేశ్వరి పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సమస్యలు పరిష్కరించండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రజా నాట్య మండలి జిల్లా సమితి ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్‌కు వినతి పత్రాన్ని జిల్లా నాయకుడు గోకారి అందజేశారు. గోకారి మాట్లాడుతూ వైఎస్సార్ బీసీ కాలనీలో ప్రతి ఇంటికి కుళాయి సౌకర్యం కల్పించాలని, సీసీ రోడ్లు, వీధి లైట్లు, మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇళ్ల స్థలాలకు సంబంధించిన ఒరిజినల్ పట్టాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు అందించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల(న్యూటౌన్): సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ఉర్దూ భాషను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం సాయిబాబానగర్‌లోని కుబ్రా షాదీఖానాలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ మైనార్టీ సంక్షేమ శాఖ అందించిన 2024 టెట్ ఉర్దూ మెటీరియల్‌ను విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. సబిహా పర్వీన్, ఆఫీజ్ అంజాద్‌బాషా సిద్ధిఖీ, సమగ్ర శిక్షరాష్ట్ర ఉర్దూ కో ఆర్డినేటర్ అబ్దుల్‌గని పాల్గొన్నారు.

కనులపండువగా.. మహానందీశుడి కల్యాణోత్సవం

మహానంది: గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శనివారం కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మల ఆధ్వర్యంలో అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్యధారణ, అక్షింతల పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల ద్వారా స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. కాగా ఆంధ్రప్రగతి బ్యాంకు జనరల్ మేనేజర్ హరికేశ్వర ప్రసాద్ స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

కళాశాలకు బెంచీల అందజేత

గోస్పాడు: దీబగుంట్ల జూనియర్ కళాశాలకు రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి బెంచీలు అందజేశారని కళాశాల ప్రిన్సిపాల్ బాలచంద్రుడు శనివారం తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు తగినన్ని బెంచీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రూ.5వేలు విలువజేసే 45 బెంచీలను అందజేశారని చెప్పారు. ప్రభుత్వ కళాశాలకు రూ.2.50లక్షలు విలువ చేసే బెంచీలను అందజేయడం అభినందనీయమన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

శానిటేషన్ కిట్ల పంపిణీ

నంద్యాల(రూరల్): పట్టణ పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు అవుదామని 26, 27వ వార్డుల కౌన్సిలర్లు చంద్రశేఖర్, జైనాబీ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వార్డు వీధుల్లో చెత్తను తొలగించే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్కు వద్ద పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ కిట్ల పంపిణీని చేపట్టారు.

సమస్యలు పరిష్కరించకుంటే జీతాలెందుకు?

దోన్: ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం నుంచి జీతాలు ఎలా తీసుకుంటారని కలెక్టర్ రాజకుమారి విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని ఆవులదొడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగ సభలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డితో పాటు కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు. సర్పంచ్ మద్దిరెడ్డితో పాటు పలువురు గ్రామస్తులు విద్యుత్ అధికారులపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో విద్యుత్ పోల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకొచ్చినా పట్టించుకోలేదని వాపోయారు. దీంతో రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కరించకుంటే ఉద్యోగాలు ఎందుకు చేయాలని నిలదీశారు. అసలు ఉద్యోగం చేస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. త్వరలోనే కొత్త పోల్స్ ఏర్పాటు చేస్తామని ఏఈ చెప్పారు.

సంబరాలు ఎందుకు బాబూ?



సన్నల సాయిరాంరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తవడంతో ఇది మంచి ప్రభుత్వం పేరుతో సంబరాలు జరుపుకోవాలని నిర్ణయించడం హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం, జేసీఎస్ కన్వీనర్ సన్నల సాయిరాంరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అక్రమ కేసులు, అరెస్టులు చేస్తున్నందుకా.. తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనందుకా?, మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తున్నందుకా?, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించనందుకా?, ఉచిత బస్సు ప్రయాణం అటకెక్కించినందుకా?, మహిళలందరికీ రూ.1500 సాయం చేయనందుకు సంబరాలు చేసుకుంటున్నారా అని ప్రశ్నించారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేకతను మూటగట్టుకోలేదని, వందరోజుల పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను రోడ్డెక్కారన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగుకు ముందుగానే పెట్టుబడి సాయం అందించారని, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాలు, పంటల బీమాను రద్దు చేశారని మండిపడ్డారు. వందరోజుల పాలనలో బాబు మాటలు నీటి మూటలుగా నిలిచాయన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చాగలమర్రి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.కోటయ్య యువతకు సూచించారు. మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై మనం బ్లడ్ డోనర్స్, సహారా సోషల్ సర్వీసెస్, అనాథ రక్షక్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఇటీవల యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐడీకే శాస్త్రి, మహబూబ్‌బాషా, శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి, శివశంకర్, పీడీ దాదాపీర్, పీఈటీ భారతి, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తెలుగు సాహిత్యానికి అడుగుజాడ గురజాడ

నంద్యాల(వ్యవసాయం): తెలుగు సాహిత్యానికి అడుగుజాడ సంఘ సంస్కరణకర్త గురజాడ అప్పారావు అని సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి పేర్కొన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు 162వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కన్యాశుల్కం నాటకం ద్వారా సమాజంలో నెలకొన్న సాంఘిక దురాచాన్ని రూపుమాపి, ప్రజలందరికీ అర్థమయ్యే రీతిలో వాడుక భాషలో రచనలు చేసి తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేసిన వ్యక్తి గురజాడ అని కొనియాడారు. కార్యక్రమంలో కవులు నీలం వెంకటేశ్వర్లు, ఆనందరావు, శేషఫణి, నరేంద్ర, ప్రసాద్, మహబూబ్‌బాషా, గ్రంథాలయ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



ఎంపీడీఓ సమక్షంలో అల్లూరు హిందూ శ్మశాన వాటికలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం



చాగలమర్రిలో పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ మహబూబ్‌దౌలా

ఉయ్యాలవాడ: పారిశుద్ధ్య పనులు మెరుగు పరచి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అల్లూరు గ్రామంలో హిందూ శ్మశాన వాటికలో వ్యర్థాలను తొలగించారు. ఈఓపీఆర్‌డి మహేంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహిమాన్, ఉప సర్పంచ్ బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శుభ్రతతోనే ఆరోగ్యం పదిలం

రుద్రవరం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఏపీఎం కల్పలత అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం రుద్రవరంలో ఎంపీడీఓ మధుసూధనరెడ్డి, వీఓఏలు, పొదుపు సంఘాల మహిళలతో ర్యాలీ నిర్వహించారు. శ్రీరంగాపురంలోనూ గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు నాగేంద్రమ్మ, సర్పంచు నంద్యాల సుబ్బమ్మ, వీఓఏలు నరసింహులు, అంజన్ కుమార్, మహిళలు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని ప్రజలకు సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ

చాగలమర్రి: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక మేజర్ పంచాయితీ కార్యాలయ పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా శనివారం పీపీటీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆయన కార్మికులకు సూచించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు కలిసి పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డి తాహీర్ హుసేన్, ఏపీఎం నాగమ్మ పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

శిరివెళ్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని యర్రగుంట్ల సర్పంచు అయ్యలూరి సుభహాన్ అన్నారు. శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది, ఆయా శాఖల సిబ్బంది ర్యాలీ చేశారు. ప్రధాన కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచు కమతం పుల్లారెడ్డి, వెలుగు సీసీ రామచంద్రుడు పాల్గొన్నారు.



శ్రీరంగాపురంలో మానవహారంగా మహిళలు,విద్యార్థులు



యర్రగుంట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచు, ప్రజలు



గుండుపాపలలో కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు

యూనిఫాం పంపిణీ

దొర్నిపాడు: ప్రతి గ్రామం స్వచ్ఛంగా ఉండేలా పని చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గుండుపాపలలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్మికులకు యూనిఫాం అందజేశారు.

సజావుగా వేలం పాట

నంద్యాల(రూరల్): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని పలు దుకాణాలకు జరిగిన వేలం పాట ప్రశాంతంగా జరిగినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ కల్పన తెలిపారు. శనివారం రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో నంద్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ (టెక్కె)లోని క్యాంటిన్‌కు, నూనెపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతనంగా నిర్మించిన 10 దుకాణాలను బాడుగకు ఇచ్చేందుకు నిర్వహించిన బహిరంగ వేలం పాటకు స్పందన లభించిందన్నారు. నూనెపల్లి మార్కెట్ యార్డ్ లోని పది షాపులకు 47 మంది వేలం పాటలో పాల్గొనగా ఒక్క షాపు రూ.11వేల వరకు అత్యధికంగా పాడి దక్కించుకోగా మిగిలిన 9 దుకాణాలు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు వేలం పలికినట్లు చెప్పారు. అలాగే టెక్కే మార్కెట్ యార్డ్ లోని క్యాంటిన్ రూ.30 వేలకు పాడగా, నూనెపల్లె మార్కెట్ యార్డులోని క్యాంటిన్ రూ.20 వేలకు పలికినట్లు వివరించారు.

ప్రజా వేదికను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుగుణశ్రీ కోరారు. కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కొత్తపల్లె గ్రామంలో సచివాలయ సిబ్బందితో గ్రామ పరిసరాలను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇస్తూనే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

శక్తి స్వరూపిణి జగజ్జననీ మాత

నంద్యాల(వ్యవసాయం): శక్తి స్వరూపిణి జగజ్జననీ మాత అని తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచారి పేర్కొన్నారు. శనివారం స్థానిక కోటావీధిలోని శ్రీ రమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో దేవి భాగవత ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 పురాణాల్లో అత్యంత శ్రేష్టమైనది దేవి భాగవత పురాణమన్నారు. లోకాలను కాపాడే చల్లని తల్లి భక్తుల పాలిట కల్పవల్లి, ఆమె గురించి విశేషంగా చెప్పే గ్రంథమే దేవి భాగవతమన్నారు. ఆలయ ఈఓ నాగప్రసాద్, చైర్మన్ యాడికి శ్రీదేవి, సురేష్ పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

నంద్యాల(రూరల్): పట్టణ వాసులు ఇంట్లోని చెత్తను రోడ్లపై వేస్తే భారీ జరిమానా తప్పదని నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ పార్కు, టౌన్ హాల్ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించి, ఆయా ప్రాంతాలను శుభ్రం చేశారు. అసిస్టెంట్ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మున్సిపాల్ పార్కును శుభ్రం చేస్తున్న కమిషనర్ నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది

తోపుడుబండి అందజేత

నంద్యాల(వ్యవసాయం): పట్టణ లయన్స్‌క్లబ్ యువ సభ్యుల విరాళంతో స్వయం ఉపాధి కోసం తోపుడు బండిని విరాళంగా శనివారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, సిరిగిరి రమేష్ మాట్లాడుతూ స్థానిక పప్పులబట్టి బజార్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన రాజుకు తోపుడు బండిని అందజేశామని చెప్పారు. డాక్టర్‌రవికృష్ణ, భవనాశి నాగమహేష్, నాగరాజు, శ్రీకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.